క్లుప్తంగా

అర్హులందరికీ రుణాలు



కల్లూరులో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

కుంటాల: రాజీవ్ యువవికాసం పథకంలో అర్హులందరికీ రుణాలు అందేలా చర్యలు తీసుకుంటామని డీపీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. కుంటాలలోని టీజీబీ, యూనియన్ బ్యాంకుల్లో సిబిల్ స్కోర్ ప్రక్రియను సోమవారం పరిశీలించారు. అనంతరం గ్రామాల్లో పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని ఆదేశించారు. మండలంలోని కల్లూరు, కుంటాల ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట డీఎల్‌పీవో సుదర్శన్, ఎంపీవో ఎంఏ రహీంఖాన్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఎం.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు భోజన్న, రాజబాపు తదితరులు ఉన్నారు.

డబ్బులు డిమాండ్ చేసిన విలేకరిపై కేసు

కుంటాల: మండలంలోని లింబా(బి) గ్రామానికి చెందిన కిరాణా వ్యాపారి నంద కిశోర్‌ను డబ్బులు డిమాండ్ చేసిన ఓ డిజిటల్ పత్రిక విలేకరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. లింబా(బి) గ్రామానికి చెందిన డిజిటల్ పత్రిక విలేకరి వరాల గిరిప్రసాద్ ఈనెల 8న నందకిశోర్ కిరాణా దుకాణానికి వెళ్లి ప్రతీనెల తనకు రూ.5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. లేదంటే చంపుతానని బెదిరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు విలేకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. అధికారులను, వ్యాపారులను, ప్రజలను ఇబ్బంది పెట్టినా, వేధించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైతుల గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు స్వీకరణ



రైతులతో ఏఈవో తిరుపతి

దస్తురాబాద్: ఆధార్ తరహాలో రైతులకు గుర్తింపు కార్డులు అందించాలని కేంద్రం నిర్ణయించింది. ఫార్మర్ రిజిస్ట్రీ పేరిట ప్రతీ రైతుకు 11 అంకెల విశిష్ట సంఖ్య కేటాయించనుంది. ఇందులోభాగంగా మండలంలోని మున్యాల గ్రామంలో పంటల వివరాలు నమోదు కోసం సోమవారం రైతుల నుంచి ఏఈవో తిరుపతి దరఖాస్తులు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. రైతుల గుర్తింపుకార్డుల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందించే సబ్సిడీలు, పథకాలకు గుర్తింపు కార్డులు ఉపయోగపడుతున్నారు. ప్రతీ రైతు మొబైల్, ఆధార్, బ్యాంక్ వివరాలు తీసుకురావాలన్నారు.

నేటి శిక్షణ తరగతులకు హాజరుకావాలి

తానూరు/లక్ష్మణచాంద: తానూరు జెడ్పీ, లక్ష్మణచాంద వడ్యాల్ జెడ్పీ సెకండరీ పాఠశాలల్లో నేటి నుంచి జరిగే శిక్షణ తరగతులకు ఉపాధ్యాయులు హాజరుకావాలని ఎంఈవోలు నరేందర్, అశోక్‌వర్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం నుంచి ప్రారంభమయ్యే శిక్షణ తరగతులు 24వ తేదీవరకు కొనసాగుతాయని తెలిపారు. ఉదయం 9.30 నుంచి 5 గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. శిక్షణలో ఉపాధ్యాయుల అభ్యసన ఫలితాలు, విభిన్న బోధన మెలకువలు, డిజిటల్ బోధన, కృత్రిమ మేధ ఉపయోగించి అభ్యాసాలు కల్పించడం, జీవన నైపుణ్యాలు అందించడం, సాంకేతికతలు అలవర్చుకోవడం వంటి అంశాల గురించి వివరిస్తారని పేర్కొన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

ఫిర్యాదుదారులకు సౌకర్యాలు కల్పించాలి

మామడ: ప్రతీ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ రామగిరి రవీందర్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రావుకు సోమవారం వినతిపత్రం అందించారు. కార్యాలయ ఆవరణలో టెంట్ సౌకర్యం, తాగునీటి వసతి ఏర్పాటు చేయాలన్నారు. భూమేష్, అఫ్రోజ్, వసంత్, పోశెట్టి తదితరులు ఉన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

తానూరు: మండలంలోని ఝరి(బి) తండాలో ఉపాధిహామీ పనులను ఏపీడీ నాగవర్ధన్ సోమవారం పరిశీలించారు. మండలంలో పనులు, కూలీల హాజరు వివరాలను ఏపీవో శివలింగయ్యను అడిగి తెలుసుకున్నారు. టీఏ రమణగౌడ్, సిబ్బంది ఉన్నారు.

సొంత భవనాలు కరువు

- అద్దె భవనంలో ప్రభుత్వ కార్యాలయాలు
- అసౌకర్యాల మధ్య నిర్వహణ
- శిథిలావస్థకు చేరిన అద్దె భవనం
- ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్న ఉద్యోగులు, సిబ్బంది



రామ్‌గోపాల్ మఠంలో బాసర తహసీల్దార్ కార్యాలయం

బాసర: పాలన సౌలభ్యం కోసం గత ప్రభుత్వం నూతన మండలాలు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా బాసర నూతన మండలంతోపాటు జోన్‌గా ఏర్పాటైంది. మండలకేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు.. రాంగోపాల్ మఠానికి చెందిన ప్రైవేట్ అద్దె భవనంలో కొనసాగుతోంది. ఇరుకు గదుల్లో వసతులు లేక, అసౌకర్యాల మధ్య నిర్వహిస్తున్నారు. వేల రూపాయలకు పైగా అద్దె చెల్లిస్తున్నారు. పైగా బాసర పరిధిలోని 10 గ్రామాల ప్రజలు తమ సమస్యలను రెవెన్యూ అధికారులకు విన్నవించేందుకు ఇక్కడికి వస్తుంటారు. ఇక్కడ వసతులు లేకపోవడంతో వివిధ పనుల నిమిత్తం ఇక్కడకు వచ్చేవారు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం అద్దెభవనం శిథిలావస్థకు చేరింది. పైగా ఇరుకు గదులు, ఇతర విభాగాల అధికారులు సర్దుకుని పరిపాలన కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొంది. కార్యాలయాల్లో రికార్డులు, కంప్యూటర్లు, అధికారులకు సరైన గదులు లేకుండా పోయాయి. అద్దె భవనం శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని ఉద్యోగులు, సిబ్బంది భయపడుతున్నారు.

ప్రభుత్వ స్థలం పరిశీలన

గతంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే రామారావు పటేల్, మండల ప్రజాప్రతినిధులు, ప్రజలు తహసీల్దార్ భవన నిర్మించాలని పలుమార్లు కలెక్టర్ అభిలాష అభినవ్‌కు విన్నవించారు. భవన నిర్మాణ కోసం ప్రభుత్వ స్థలం కోసం ప్రతిపాదన పంపాలని తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. పోచమ్మ గల్లీలో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు ప్రతిపాదన పంపినట్లు తహసీల్దార్ పవన్‌చంద్ర తెలిపారు.

విధులు నిర్వహిస్తున్న అధికారులు

తహసీల్దార్‌తోపాటు 1 డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సీనియర్ అసిస్టెంట్, 7 జూనియర్ అసిస్టెంట్లు, 2 రికార్డు అసిస్టెంట్లు, 1 సర్వేయర్, ఒకరు ఏఎస్ఓ, ధరణి సీఎంఆర్ఓ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి భూ సర్వేను చేపట్టాం. అనుకూలమైన భవన నిర్మాణానికి స్థలం ఉందని ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించాం.
– పవన్‌చంద్ర, తహసీల్దార్, బాసర

బాధ్యతల స్వీకరణ

లక్ష్మణచాంద: లక్ష్మణచాంద నూతన తహసీల్దార్‌గా సరిత సోమవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన జానకి బదిలీపై కామారెడ్డి జిల్లాకు వెళ్లారు. నిర్మల్ కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న డి.సరిత లక్ష్మణచాంద తహసీల్దార్‌గా నియమితులయ్యారు. బాధ్యతలు చేపట్టిన సరితకు డీటీ అబ్దుల్ అజీజ్, సిబ్బంది కిరణ్ శుభాకాంక్షలు తెలిపారు.

దస్తురాబాద్ తహసీల్దార్‌గా విశ్వంబర్



విశ్వంబర్ (ఫైల్)

దస్తురాబాద్: తహసీల్దార్‌గా బత్తుల విశ్వంబర్ నియమిస్తూ కలెక్టర్ కార్యాలయం నుంచి సోమవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇక్కడ విధులు పనిచేసిన సర్ఫరాజ్ నవాజ్ బదిలీపై లోకేశ్వరం వెళ్లారు. గతంలో తహసీలార్‌గా విధులు నిర్వర్తించిన విశ్వంబర్ ఎన్నికల్లో భాగంగా జగిత్యాల జిల్లాకు వెళ్లారు. తాజాగా నిర్మల్ జిల్లాకు బదిలీపై ఇక్కడకు వచ్చారు.



తహసీల్దార్ సరితకు బాధ్యతలు అప్పగిస్తున్న జానకి

నర్సాపూర్ (జి) తహసీల్దార్‌గా శ్రీకాంత్



శ్రీకాంత్

నర్సాపూర్(జి): నర్సాపూర్ (జి) తహసీల్దార్‌గా శ్రీకాంత్ సోమవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన సోమ శ్రీనివాస్ బదిలీపై నిజామాబాద్ వెళ్లారు. ముధోల్ తహసీల్దార్‌గా పనిచేసిన శ్రీకాంత్ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

‘కాంగ్రెస్‌ది అధికార దుర్వినియోగం’



మాట్లాడుతున్న జాన్సన్‌నాయక్

ఖానాపూర్: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష బీఆర్‌ఎస్ నేతలపై అక్రమ కేసులు నమోదు చేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతుందని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ ఆరోపించారు. స్థానిక బీఆర్‌ఎస్ క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులతో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఉట్నూర్ నుంచి ఖానాపూర్ వస్తున్న తనపై కాంగ్రెస్ నాయకులు అప్పట్లో అడ్డగించి హంగామా చేశారన్నారు. ఈ విషయమై కాంగ్రెస్ ప్రభుత్వం గత సంఘటనలను పునరావృతం చేస్తూ తిరిగి తమపై కేసులు నమోదు చేయిస్తూ కక్ష సాధింపు చర్యలకు దిగుతుందని ఆరోపించారు. ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా ప్రజా కోర్టులో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు కొక్కుల ప్రదీప్, సల్ల నరేందర్‌రెడ్డి, నామెడ ధర్మరాజు, రంజిత్, సాయి, మహిపాల్ పాల్గొన్నారు.

బుద్ధవిగ్రహం పునఃప్రతిష్ఠించాలి

భైంసాటౌన్: ముధోల్ మండలం రాళ్ల బోరిగాంలో తొలగించిన బుద్ధ విగ్రహాన్ని తిరిగి ప్రతిష్ఠించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు అంబేద్కర్, బుద్ధ విగ్రహ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో, మాజీ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బుద్ధజయంతి సందర్భంగా గ్రామంలో బుద్ధుడి విగ్రహం ఏర్పాటు చేసి పూజలు చేస్తుండగా, కొందరు కుల వివక్షతో దాడి చేశారన్నారు. అంతేగాక, రెవెన్యూ అధికారులు విగ్రహం తొలగించడం బుద్ధ భక్తులను అవమానించడమేనని అన్నారు. గ్రామంలో సదరు ప్రభుత్వ భూమిని బుద్ధవిహార్ కోసం కేటాయించి, విగ్రహం పునఃప్రతిష్ఠించాలని కోరారు. కమిటీ సభ్యులు దేవిదాస్ హస్తే, గిరిధర్ జంగ్మే, గంగాధర్ జాడే, దిగంబర్ మగ్గిడి, లక్ష్మణ్, ప్రభాకర్, నారాయణ్ వాగ్మారే, తదితరులున్నారు.



ముధోల్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

ముధోల్: బోరిగాంలో తొలగించిన బుద్ధ విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలని దళిత సంఘాల నాయకులు, సమతాసైనిక్ దళ్, వివిధ సంఘాల కార్యకర్తలు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. విగ్రహాన్ని మరో వారం రోజుల్లో పునఃప్రతిష్ఠించాలని లేకపోతే నిరాహార దీక్ష చేపడుతామన్నారు. దళిత సంఘాల నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



ఏపుగా పెరిగిన కోనోకార్పస్ మొక్కలు



కోనో కార్పస్ మొక్కలు తొలగించిన తర్వాత..

కోనో కార్పస్ చెట్లు తొలగింపు

సాక్షి స్పందన

బాసర: బాసర క్షేత్రంలోని శివాజీ చౌక్ వద్ద డివైడర్ మధ్య నాటిన కోనోకార్పస్ మొక్కలు ఏపుగా పెరిగి వృక్షంగా మారాయి. దీంతో ఈ మార్గంలో జ్ఞాన సరస్వతి ఆలయ ముఖద్వారం వద్ద అమ్మవారి విగ్రహం కనిపించకుండా ఉంది. ఈ తీరును వివరిస్తూ ‘కమ్మేసిన కోనో కార్పస్’ శీర్షికన సాక్షిలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌గౌడ్ స్పందించి వాటిని తొలగించారు. ప్రత్యేక చొరవ చూపిన ‘సాక్షి’కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ తీగలు సరిచేశారు



సరిచేయిస్తున్న ఏఈ శివకుమార్

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి మసీదు ఎదుట విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. ఈ తీరును వివరిస్తూ ‘కర్ర’ంటు స్తంభం డేంజర్’ శీర్షికన సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ ఏఈ శివకుమార్ స్పందించారు. ఆయన ఆదేశాలతో ధర్మోర జేఎల్‌ఎం గంగాధర్ ఆ తీగలను సరిచేశారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి

- పీసీసీ జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్‌గౌడ్



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌గౌడ్

సారంగపూర్: కాంగ్రెస్ బలోపేతానికి పార్టీ కార్యకర్తలు, గ్రామ కమిటీల అధ్యక్షులు, మండల నాయకులు కృషి చేయాలని పీసీసీ జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని స్వర్ణ గ్రామంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అధ్యక్షతన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ, మండల కమిటీల్లో పనిచేయడానికి ఆసక్తి కనబర్చిన కార్యకర్తలు, నాయకుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ ప్రతీ గ్రామంలో విజయకేతనం ఎగురవేసేలా కార్యకర్తలు, నాయకులు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీ పదవుల్లో యువకులకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, స్థానిక ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ, అడెల్లి ఆలయ కమిటీ చైర్మన్ భోజాగౌడ్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ నారాయణరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటరమణారెడ్డి, రాజ్‌మహ్మద్, సలీమ్, జగదీశ్వర్ పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

భైంసారూరల్: మండలంలోని మహాగాం గ్రామంలో ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం మహిళలు మంగళహారతులతో శోభాయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా పండితుల వేదమంత్రోచ్చారణలతో పూజలు చేసి అమ్మవారిని ప్రతిష్ఠించారు. భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



దర్శించుకుంటున్న భక్తులు

తిర్పెల్లిలో..

లక్ష్మణచాంద: తిర్పెల్లిలో సోమవారం ముత్యాల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గోదావరి జలాలు తెచ్చి విగ్రహాలకు గ్రామస్తులు అభిషేకం నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రధానవీధుల గుండా ఊరేగించారు. విగ్రహాలకు పూజలు అనంతరం హోమం నిర్వహించారు. మాజీ సర్పంచ్ క్రిష్టారెడ్డి, నాయకులు చిన్నయ్య, రవి పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న గ్రామస్తులు

ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్, సుర్జాపూర్ శివారు గల శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. పంచముఖి హనుమాన్ ఉపాసకులు నిమ్మగడ్డ సందీప్ శర్మ వైదిక బృందం ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్‌తోపాటు బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ హాజరై పూజలు చేశారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గౌడ సంఘం నాయకులు, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న పండితులు

ఖానాపూర్ వాసికి దళితరత్న అవార్డు

ఖానాపూర్: బేడ బుడగ జంగల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టేకు మధు సోమవారం దళిత రత్న అవార్డును అందుకున్నాడు. హైదరాబాద్‌లో అంబేద్కర్, జగ్జీవన్ రామ్ ఉత్సవకమిటీ చైర్మన్ రాజు, బేడ బుడగ జంగం రాష్ట్ర నాయకులు రాజలింగం, హనుమంతు, వెంకటేష్ ఆధ్వర్యంలో అవార్డు అందజేశారు. అవార్డు రావడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని టేకు మధు తెలిపారు. దళితులు, బేడ బుడగ జంగం కులస్తుల సంక్షేమానికి కృషిచేస్తానని పేర్కొన్నారు.

సంక్షిప్తంగా

సప్తాహంలో పాల్గొన్న ఎమ్మెల్యే

భైంసారూరల్: మండలంలోని కుంసర గ్రామ హనుమాన్ ఆలయంలో నిర్వహిస్తున్న అఖండ హరినామ సప్తాహంలో ఎమ్మెల్యే రామారావు పటేల్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను సన్మానించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

భైంసారూరల్: కుంటాల మండలం పెంచికల్‌పాడ్‌కు చెందిన వెంకటేశ్‌కు రూ.22,500, లోకేశ్వరం మండలం నగర్‌కు చెందిన లక్ష్మికి రూ.37,500, పిప్రికి చెందిన పి.లక్ష్మికి రూ.60 వేల సీఎం సహాయ నిధి ఆర్థికసాయం మంజూరైంది. భైంసా మండలం దేగాంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తన నివాసంలో చెక్కులు పంపిణీ చేశారు. నాయకులు సాయన్న, సాయిరెడ్డి తదితరులు ఉన్నారు.

తిరంగాయాత్రను జయప్రదం చేయండి

భైంసాటౌన్: ఆపరేషన్ సిందూర్ విజయవంతం నేపథ్యంలో పట్టణంలో మంగళవారం తిరంగాయాత్ర చేపట్టనున్నట్లు హిందూసంఘాల నాయకులు తెలిపారు. సోమవారం పట్టణంలోని వేంకటేశ్వరాలయంలో మాట్లాడారు. ఉదయం 10 గంటలకు స్థానిక పద్మావతి కాలనీలోని వెంకటేశ్వరాలయం నుంచి యాత్ర ప్రారంభమై, బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగుతుందన్నారు. యాత్ర ముగిసే వరకు వ్యాపారులు దుకాణాలు పాటించి ర్యాలీలో పాల్గొనాలని కోరారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాజేశ్వర్, కపిల్ సింధే, కాశినాథ్, తోట రాము పాల్గొన్నారు.

‘ప్రైవేట్ పనులకు మున్సిపల్ కార్మికులు’

భైంసాటౌన్: పట్టణంలో పలు ప్రైవేట్ పనులకు మున్సిపల్ పారిశుధ్య కార్మికులను వినియోగిస్తున్నారని మాజీ కౌన్సిలర్ అనిత, బీజేపీ నాయకుడు బాలాజీ సూత్రావే ఆరోపించారు. ఈ మేరకు సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని ఓ కాలనీలో ప్రైవేట్ వ్యక్తికి చెందిన భవన వ్యర్థాలను మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో ఎత్తివేయించడంతోపాటు, మున్సిపల్ ట్రాక్టర్‌ను వినియోగించడం విడ్డూరమని అన్నారు. ప్రజా సమస్యలపై స్పందించని మున్సిపల్ అధికారులు, ఇలా ప్రైవేట్ పనులకు కార్మికులను ఉపయోగించడం సరికాదన్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ బి.రాజేశ్‌కుమార్‌ను ‘సాక్షి’ ఫోన్‌లో సంప్రదించగా, స్పందించలేదు.

హనుమాన్ ఆలయంలో పూజలు

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే భజన కార్యక్రమం చేపట్టారు. అనతరం అన్నదానం నిర్వహించారు. పూజలో బ్రహ్మేశ్వర(పుట్ట) డాక్టర్ అనంద సరస్వతి స్వామిజీ సత్యానారాయణ పాల్గొన్నారు.

గుల్జార్ హౌస్ బాధితులను ఆదుకోవాలి

భైంసాటౌన్: హైదరాబాద్‌లోని గుల్జార్‌హౌస్ అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త విలాస్ గాదేవార్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని తన కార్యాలయంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ముందుగా మృతులకు సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. మృతులకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. నాయకులు కపిల్, వాసే రసూల్, భీమేష్, రహమత్, ఆనంద్ ఉన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి శోభాయాత్ర

ముధోల్: మండల కేంద్రంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి శోభాయాత్రను గ్రామస్తులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండ్లపై వీరబ్రహ్మేంద్ర స్వామి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర చేపట్టారు. పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్రపై పాటలను పాడుతూ భజనలను చేశారు. ఈసారి వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలను పండాలని కోరుకున్నారు. అనంతరం కోలిగల్లీ హనుమాన్ ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు.

కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి

లోకేశ్వరం: మండలంలోని జోహర్‌పూర్‌లో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. సీపీఎం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కామ్రేడ్ పోశెట్టి, నాయకులు గంగన్న, గణపతి, సంజీవ్, దీక్ష, భాగ్య, జతిన్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

తానూరు: హిప్నెల్లి సమీపంలోని భైంసా–తానూరు రహదారిపై సోమవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఏఎస్సై భానుప్రసాద్, పోలీసులు.. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి

కుంటాల: ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలని ఏపీఎం అశోక్ సూచించారు. మండలంలోని లింబా(కె)లో ఐకేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. కేంద్రం కమిటీ సభ్యులు గోనె చంద్రబాబు, గోనె లక్ష్మి, వీవోఏ గౌతమ్ ఉన్నారు.

అధ్యాపకుల ప్రచారం

కుభీర్: మండల కేంద్రంలో ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు సంపద్, నర్సయ్య ప్రచారం నిర్వహించారు. ఇటీవల పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలో కల్పిస్తున్న వసతుల గురించి వివరించారు. అనంతరం ప్రభుత్వ కళాశాలలో కొందరు విద్యార్థులను చేర్పించారు.

నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్ కాలనీలో ప్రమాదకరంగా పడిపోయే స్థితిలో ఉన్న విద్యుత్ స్తంభం తొలగించి సోమవారం నూతన స్తంభాన్ని ఏర్పాటుచేశారు. మాజీ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం.. స్తంభం ఏర్పాటు కోసం ఇటీవల ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు దృష్టికి తీసుకెళ్లగా ఆయన చొరవతో సమస్య పరిష్కారమైందని తెలిపారు.

భూభారతితో సమస్యలు పరిష్కారం

కుంటాల: భూభారతితో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ కమల్‌సింగ్ పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక కౌంటర్ ద్వారా 85 దరఖాస్తులను స్వీకరించారు. ఇప్పటివరకు మండల వ్యాప్తంగా 674 దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. డీటీ నరేశ్ గౌడ్, రికార్డ్ అసిస్టెంట్లు సాయన్న, ఆనంద్ తదితరులు ఉన్నారు.

కోనేరు పనుల పరిశీలన

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ ఆలయ కోనేరు నిర్మాణ పనులను వేద పండితుడు చంద్రశేఖరశర్మ సోమవారం పరిశీలించారు. ఆయన వెంట కోనేరు నిర్మాత దాత అల్లాల శ్రీనివాస్ రావు, గురుస్వామి జక్కని గజేందర్, తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

ఖానాపూర్: గోసంపల్లె, గోడలపంపు గ్రామాలకు చెందిన పలువురు యువకులు సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఖానాపూర్ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్‌వారికి గులాబీ కండువాలు కప్పారు.

సత్తనపల్లి పీఏసీఎస్ సీఈవోపై ఫిర్యాదు

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నిధులు దుర్వినియోగం చేస్తున్న సీఈవో శ్రీనివాస్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పలువురు సంఘం డైరెక్టర్లు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పీఏసీఎస్ డైరెక్టర్లు నారాయణ, రాజన్న, శంకర్, గణేశ్ మాట్లాడారు. సత్తనపల్లి సీఈవో గతంలో రాజురా, పెంబి సంఘాల్లో పనిచేసిన సమయంలో పలు అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. నాటి అక్రమాలపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోకుండా తిరిగి సీఈవోగా బాధ్యతలు అప్పగించడంతో సంఘంలో రూ.కోటికి పైగా నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డాడని పేర్కొన్నారు. ఈ విషయమై ఆధారాలు, సమగ్ర వివరాలతోపాటు ఆడిట్ రిపోర్టులతో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి ఆ నిధులను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముథోల్ : జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899